క్లుప్తంగా

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

శ్రీరంగరాజపురం: ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి ఆదివారం శ్రీరంగరాజపురం మండలంలో పర్యటించనున్నట్టు వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు మణి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే వైఎస్సార్‌ పెన్షన్‌ కానుక పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొంటారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొనాలని కోరారు.

ఎస్టీయూ క్యాలెండర్‌ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

నగరి : మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఎస్టీయూ 2024 డైరీ, కాలండర్‌ను ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైరీలో ఉపాధ్యాయులకు ఉపయోగపడే విలువైన సమాచారాన్ని పొందుపరిచారని కొనియాడారు. ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి కలికిరి పవన్‌ కుమార్‌రెడ్డి , ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌ టీఎం సుబ్రమణ్యం, నగరి మండల శాఖ గౌరవాధ్యక్షుడు నాగభూషణం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీ నారాయణ, ఊత్తుకోట రాజశేఖర్‌, ఆర్థిక కార్యదర్శి నారాయణస్వామి, జిల్లా నాయకులు గంగామోహన్‌, గణేశన్‌, గిరి, మహేంద్రన్‌, సి.మోహన్‌, మండల నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న తహసీల్దార్‌ కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: పట్టణంలో ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం తహసీల్దార్‌ రవికుమార్‌ కుటుంబ సభ్యులు 3 వందల మందికి అన్నదానం చేశారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్‌ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి భక్తుడు ముందుకొచ్చి శుక్రవారం, శనివారంలోనే కాకుండా రోజూ అన్నదానం చేయాలని కోరారు.

క్యాలెండర్‌ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్‌

గంగాధర నెల్లూరు : ఆర్టీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం తహసీల్దార్‌ ఇన్బనాథన్‌ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్టీఐ సంఘ సభ్యులు బండి పట్టాభి రెడ్డి, రామ్‌రాజ్‌, డీకే కుమార్‌, తిలక్‌, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరుకు రామయ్య అక్షింతలు



అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

పెనుమూరు(కార్వేటినగరం) : అయోధ్య రామయ్య అక్షింతలు శనివారం పెనుమూరుకు చేరుకున్నాయి. వాటికి పెనుమూరులోని శ్రీరాములు ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వాటిని ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకాష్‌నాయుడు, వాసుదేవనాయుడు, రామకృష్ణ, గోపాల్‌ మందడి, చిన్నస్వామి, రామమూర్తి, మోహన్‌, యుగబాబు, భాస్కర్‌శెట్టి పాల్గొన్నారు.

గోవిందనామ కీర్తనతో నగర సంచారం



నగర సంచారం చేస్తున్న గోవింద భక్తులు

తిరుపతి కల్చరల్‌: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని రాయలసీమ రంగస్థలి కళాకారుల ఆధ్వర్యంలో శనివారం గోవిందనామ సంకీర్తనలతో నగర సంచారం చేపట్టారు. కళాకారులు, భక్తులతో గరుడ దీపాన్ని చేతపట్టి గోవిందనామాన్ని ఆలపిస్తూ వాయిద్య సహకారంతో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు ప్రజలకు భక్తిభావాన్ని తెలియజేస్తూ శ్రీగోవిందరాజస్వామి ఆలయ మాడ వీధులు, గాంధీరోడ్డు మీదుగా తిలక్‌ రోడ్డు వరకు ఈ గోవిందనామ సంకీర్తన మధురంగా సాగింది. రంగస్థలి చైర్మన్‌ గుండాల గోపినాథ్‌రెడ్డి, కేఎస్‌.రాజా, జేజిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, తిరుపాలాచారి, శాంబోలు హరినాథ్‌, చెంగారెడ్డి, వెంకట్రామయ్య, కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.

జ్ఞాపకాలకు చిరునామా ఫొటోలే

- ఫొటోగ్రాఫర్ల భవన నిర్మాణ భూమి పూజలో మంత్రి ఆర్కేరోజా
- రాష్ట్ర స్థాయిలో రెండవ, జిల్లాలో ప్రథమంగా ఫొటోగ్రాఫర్స్‌ భవనం



ఫొటో, వీడియో గ్రాఫర్స్‌ అసోసియేషన్‌ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : జ్ఞాపకాలకు చెరగని ముద్ర వేసేది ఫొటోగ్రాఫర్లే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీమునీశ్వర ఆలయ సమీపంలో ఎంపీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే నగరి ఫొటో, వీడియో గ్రాఫర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ భవన నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మధుర జ్ఞాపకాలకు చెరగని ముద్ర వేసేది ఫొటో, వీడియో గ్రాఫర్లే అన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా ఫొటోగ్రఫీకి, వీడియో క్రేజ్‌ ఏమాత్రం తగ్గలేదన్నారు. ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘ భవనానికి భూమి పూజ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. స్థానిక అసోసియేషన్‌ వారి కోరిక మేరకు భవన నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర సెక్రటరీ మోహన్‌ రాజు మాట్లాడుతూ నేడు భవన నిర్మాణానికి చేసిన భూమి పూజ ఫొటో, వీడియో గ్రాఫర్లకు దక్కిన అరుదైన గౌరవమన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఫొటో, వీడియోగ్రాఫర్స్‌ అసోసియేషన్‌ భవనం పాలకొల్లులో ఒక్కటే ఉందని, నేడు నగరిలో రెండవ భవనం నిర్మిస్తున్నారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇదే ప్రథమమన్నారు. సహకరించిన మంత్రి ఆర్కేరోజాకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శిల్పారామంలో ఈనెల 27వ తేదీన జరిగే ఫొటో ఎగ్జిబిషన్‌ పోస్టర్లను విడుదల చేశారు. సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌, కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, ఇంద్రారెడ్డి, నాయకులు సలీం, చిన్నదొరై, నగరి పుత్తూరు ఫొటో, వీడియో గ్రాఫర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

ఆశీర్వదించారు.. సేవ చేస్తున్నాను..



ఆపరేషన్‌ చేయించుకున్న వృద్ధులను పలకరిస్తున్న మంత్రి రోజా

నగరి : 'మీరు నాకు ఓటు వేసి ఆశీర్వదించినందునే నేడు మంత్రిగా ఉన్నా.. అలా మీకు సేవ చేసే అవకాశం దక్కింది.. సేవ చేస్తున్నా' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయం వద్ద నేత్ర వైద్యశిబిరంలో కంటి ఆపరేషన్లు చేసుకున్న వారిని పేరుపేరునా పలకరించి ఇక ఎలాంటి సమస్య ఉండదని, కంటి చూపు బాగా కనబడుతుందని వైద్యులతో కలిసి భరోసా ఇచ్చారు. అందరికీ తన నివాసం వద్దే భోజనం పెట్టి, ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా ఉచిత ఆపరేషన్‌ చేసుకున్న అవ్వతాతలు భావోద్వేగానికి లోనై మాట్లాడుతూ తమ ఇంటి బిడ్డలా మంత్రి రోజా ఆదుకుంటున్నారని, ఈ వృద్ధాప్య దశలో తమకు చేసిన మేలు ఎన్నటికీ మరువమని ప్రశంసించారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ తాను నేడు సేవ చేస్తున్నానంటే, రెండుసార్లు నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతోనే అని తెలిపారు. పదిమందికి సేవచేసే అవకాశం కొందరికే దక్కుతుందని, ఆ కొంతమందిలో తాను ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్లిన సమయంలో కంటిచూపు మందగించి ఇబ్బంది పడుతున్న వృద్ధుల పరిస్థితిని గమనించానన్నారు. వారు సుదూర ప్రాంతాలకు వెళ్లి కంటి ఆపరేషన్‌ చేయించుకోలేరనే, వారికి శంకర నేత్రాలయ వారిని సంప్రదించి పట్టుబట్టి నగరికి రెండుసార్లు రప్పించినట్లు తెలిపారు. కంటి చూపు నిచ్చావంటూ ఆప్యాయంగా అవ్వతాతలు ఇచ్చే దీవెనలు భగవంతుడు ఇచ్చినట్లే భావిస్తానని తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ వైద్యశిబిరంలో 520 మందికి ఇప్పటి వరకు పరీక్షలు నిర్వహించగా 120 మందిని ఆపరేషన్‌ నిమిత్తం ఎంపిక చేశారన్నారు. వారిలో కంటిపొర సమస్య ఉన్న 58 మందికి చికిత్స జరిగిన ప్రాంతంలోనే శంకర నేత్రాలయకు చెందిన ప్రఖ్యాత కంటివైద్య నిపుణులు శంకర్‌, గజేంద్ర నొప్పి లేకుండా, కుట్లు లేకుండా అత్యాధునిక పద్ధతిలో రెండు గంటల వ్యవధిలోనే ఆపరేషన్‌ చేసినట్లు తెలిపారు. ఐఓఎల్‌ లెన్స్‌, కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందించారు. మధ్యాహ్నం అందరికీ మంత్రి నివాసం వద్దే భోజన సౌకర్యం కల్పించారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



బంగారు తిరుచ్చిపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు సాక్షాత్కరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి, వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్‌ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆసీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్‌ గ్రేడ్‌ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్‌, సూపరింటెండెంట్‌ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్‌ ధనశేఖర్‌, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆడుదాం–ఆంధ్రా



సత్యవేడు: క్రికెట్‌ ఆడుతున్న క్రీడాకారులు

సత్యవేడు: ఆడుదాం.. ఆంధ్రా పోటీలు రసవత్తరంగా సాగుతున్నట్లు ఎంఈడీఓ చంద్రశేఖర్‌ తెలిపారు. శనివారం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్‌ పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయన్నారు. రెండో దశకు ఎంపికైన 170 టీములు, 1938 మంది క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించే అవకాశం ఉందన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి మండల స్థాయి రెండవ దశ ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ప్రారంభమవుతాయన్నారు.ఎంఈఓ కె.రవి, పీడీలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్ట్‌లు పంపిణీ

నాగలాపురం: మండలంలోని ఎస్‌ఎస్‌పురం గ్రామ సచివాలయంలో శనివారం ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులకు సర్పంచ్‌ కె.కృష్ణమ శెట్టి చేతుల మీదుగా టీషర్ట్‌లు అందజేశారు. సర్పంచ్‌ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు.

నైపుణ్యాలను వెలికితీసేందుకే..

నారాయణవనం: గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తెచ్చేందుకే ఆడుదాం–ఆంధ్రను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంపీపీ దివాకర్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నారాయణవనంలోని మూడు సచివాలయాల పరిధిలోని యువకులకు ఆడుదాం–ఆంధ్ర క్రీడలకు సంబంధించి దుస్తులు, ఆట వస్తువులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏవో గుణశేఖర్‌, ఎంఈవో ప్రభాకర్‌రాజు, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, ప్రజాప్రతినిధులు చిన్నదొరై, గురుస్వామి, మనోహర్‌, సారకాయలు, మోహన్‌, దొరైరాజ్‌, ఢిల్లీబాబు, హెచ్‌ఎం శశికల, పీడీలు జయప్రకాష్‌, జయప్రద, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



నారాయణవనం: కిట్లను అందజేస్తున్న ఎంపీపీ

క్రీడాకారులకు వరం ఆడుదాం ఆంధ్ర

వరదయ్యపాళెం: ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలు గ్రామీణ క్రీడాకారులకు వరం లాంటిదని జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కదూరు సచివాలయానికి సంబంధించి గోవర్ధనపురం హైస్కూల్‌ క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యుడు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరై పోటీలను ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, క్రికెట్‌, టెన్నిస్‌ క్రీడా పోటీల్లో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, సురుటుపల్లి పాలక మండలి సభ్యుడు నాని రెడ్డి, మండల యూత్‌ కన్వీనర్‌ వినోద్‌ యాదవ్‌, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, పీఈటీలు బందిల కుమార్‌, ముద్దుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోషణ కిట్లు సక్రమంగా అందజేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌

సత్యవేడు: అంగన్‌ వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్‌ పోషణ కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వెల్ఫేర్‌ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక పదార్థాలను (పాలు, బాలామృతం), వైఎస్సార్‌ కిట్‌(అటుకులు, రాగి పిండి, బెల్లం, చిక్కీ, కర్జూరం) లబ్ధిదారులకు అందించే విధానాలపై సమావేశం జరిగింది. సూపర్‌వైజర్‌ ఏ. చెంచులక్ష్మి మాట్లాడుతూ 55 సెంటర్ల పరిధిలో గర్భిణులు 337 మంది, బాలింతలు 397 మందికి పోషక పదార్థాలు సక్రమంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 17 సచివాలయాల వెల్ఫేర్‌ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సీఐగా భాస్కర్‌నాయక్‌



భాస్కర్‌నాయక్‌

నారాయణవనం: పుత్తూరు రూరల్‌(నారాయణవనం) సీఐగా శనివారం సాయంత్రం భాస్కర్‌నాయక్‌ బాధ్యతలు తీసుకున్నారు. ఇదివరకు సీఐగా పనిచేసిన సురేష్‌బాబు ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీపై వెళ్లారు. తిరుపతి వీఆర్‌ నుంచి భాస్కర్‌నాయక్‌ ఇక్కడికి వచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్కిల్‌ పరిధిలో శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



పూతలపట్టు: మండలంలోని పేటమిట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమరరాజా కంపెనీ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రానాయుడు శాంతి హోమం, గోపూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల నడుమ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ కుంభాభిషేకం ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తెలుగును రక్షించుకుందాం

పుంగనూరు: పరాయి భాషపై వ్యామోహంతో తెలుగు భాషను మరిచిపోతున్నారని, తేనెలొలుకు తెలుగు భాషను పరిరక్షించుకుందామని తెలుగు సాహితీ వికాస సమితి అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బసవరాజ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్‌ విజయకుమార్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు భాష గొప్ప దనం, విలువలపై అవగాహన కల్పించారు.

పూతకు ముందే మందుల పిచికారీ

పులిచెర్ల(కల్లూరు) : మామిడి చెట్లలో పూత రావడానికి ముందే మందులు పిచికారీ చేయాలని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల రైతులకు మామిడి పూత దశలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పూత బాగా నిలవడానికి లీటరు నీటిలో 8 గ్రాముల ఆర్గామాంగో స్పెషల్‌ కలిపి పిచికారీ చేయాలన్నారు.

పేదల కోసం తపించే నాయకుడు జగన్‌



వైఎస్సార్‌ పెన్షన్‌ను పంపిణీ చేస్తున్న డిప్యూటి సీఎం నారాయణస్వామి

- పింఛన్ల పంపిణీలో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న డిప్యూటి సీఎం

పాలసముద్రం : పేదల కోసం తపించే నాయకుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఇచ్చిన మాటకు కట్టుబడి అవ్వాతాతలకు రూ.3 వేలు పింఛను ఇస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. ఆయన శనివారం జెడ్పీటీసీ అన్బలగన్‌, ఎంపీపీ శ్యామల, మండల కన్వీనర్‌ తులసి యాదవ్‌తో కలిసి పాలసముద్రం ఉన్నత పాఠశాల ఆవరణలో పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. పేదల ఆరోగ్య కోసం ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారని వివరించారు. 45 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల మహిళలకు రూ.18,750, కాపు నేస్తం పథకం ద్వారా రూ.15 వేలు ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామనాథరెడ్డి, తహసీల్దార్‌ బాబు, సింగిల్‌ విండో చెర్మన్‌ గాలిజ్యోతి, ఆర్బీకే చైర్మన్‌ పోలయ్య, వైస్‌ ఎంపీపీలు శేఖర్‌ యాదవ్‌, పుష్ప, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, లిల్లీ, మహేష్‌, అయ్యప్ప, అనురేఖ, నరసింహరాజు, భోభ, జీవిత, ఎంపీటీసీ గోవిందరాజు, లిఖిత పాల్గొన్నారు.



గోదారమ్మకు నివాళులర్పిస్తున్న నారాయణస్వామి

గోదారమ్మ కుటుంబానికి పరామర్శ

కార్వేటినగరం: మండలంలోని అన్నూరు గ్రామానికి చెందిన సింగిల్‌విండో అధ్యక్షుడు వి.లోకనాథ రెడ్డి తల్లి గోదారమ్మ(85) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి గోదారమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, పార్టీ మండల కన్వీనర్‌ శేఖర్‌రాజు, మాజీ మండల కన్వీనర్‌ ధనుంజయవర్మ, జేసీఎస్‌ కన్వీనర్‌ పురంధర్‌, లోకనాథనాయుడు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన సమష్టి బాధ్యత



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యతని పుత్తూరు సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎస్‌సీ.రాఘవేంద్ర అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం నేర ప్రవృత్తిని కలిగిస్తుందని, దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే లైగింక వేధింపులను నిర్మూలించాలని, పని చేసే చోట స్త్రీలను గౌరవించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలని, ఫాస్ట్‌ ఫుడ్‌ జోలికి వెళ్లకూడదని చెప్పారు. ఫాస్ట్‌ ఫుడ్‌ తీసుకోవడం ద్వారా క్యాన్సర్‌ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని తెలిపారు. అడిషినల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి సి.జానకి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రజలు తమ వంతు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు పట్టుదలతో చదవాలని సూచించారు. నేటి సమాజంలో విద్యకు మించిన సంపద మరొకటి లేదన్నారు. ఎలాంటి వ్యామోహాలకు లోనుకాకుండా చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. 18 ఏళ్లు నిండేంతర వరకు వివాహానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్‌ గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం

నగరి : బాలలను పనిలో పెట్టుకోవడం నేరమని జూనియర్‌ సివిల్‌ మెజిస్ట్రేట్‌ ఎస్‌.విష్ణువర్మ అన్నారు. శనివారం నగరి మండపం సమీపం ఉన్న నగరి గార్మెంట్స్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల హక్కులు, రక్షణ చట్టాలను వివరించారు. బాలలను కార్మికులుగా పెట్టుకోకూడదని తెలిపారు. పని చేసే చోట ఏవైనా సమస్యలుంటే న్యాయస్థానాన్ని మహిళలు సంప్రదించవచ్చన్నారు. బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మణివాసకం, న్యాయవాదులు ధరణి, ఎం.బాబు, ఈజీ బాబు, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నగరి: సదస్సులో మాట్లాడుతున్న జడ్జి విష్ణుశర్మ

ఉపాధిలో రూ.38 వేలు రికవరీకి ఆదేశాలు



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్‌

పుత్తూరు: వడమాలపేట మండలంలో 2022–23 ఏడాదిలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.38 వేలు రికవరీ చేయాల్సిందిగా అధికారులను ద్వామా పీడీ సీవీ శ్రీనివాసప్రసాద్‌ ఆదేశించారు. శనివారం వడమాలపేట ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఆడిట్‌ అధికారులు నిర్వహించిన తనిఖీలో వేతన రూపంలో రూ.7 కోట్ల, 8 లక్షల, 49వేల 292 చెల్లించినట్లు తెలిపారు. మెటీరియల్‌ కింద రూ.1,01,94,258 ఖర్చు చేసినట్లు తెలిపారు. దీనిపై తనిఖీ బృందం రూ.38 వేలు అవకతవకలు జరిగినట్లు తేల్చిందని వెల్లడించారు. ఎంపీపీ విజయలక్ష్మి, డీటీఓ భాగ్యలక్ష్మి, రాసారాయనాయుడు, ఏపీడీ సరిత, ఎంపీడీఓ భానుమూర్తి, ఏపీఓ సుజాత, ఎస్‌ఆర్‌పీ రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే భూకబ్జాలు

వెదురుకుప్పం: భూ కబ్జాలు టీడీపీ నాయకుల పేటెంట్‌ అని, పేదల భూములను కొల్లగొట్టి ఇప్పుడు పేదలకిచ్చే భూపంపిణీపై ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని జేసీఎస్‌ మండల కన్వీనర్‌, వైఎస్సార్‌ సీపీ బీసీ సెల్‌ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం ఆరోపించారు. మండలంలో భూపంపిణీలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని టీడీపీ, జనసేన నేతలు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు చేసిన పాపాలకు రెవెన్యూ అధికారులు సస్పెండ్‌ అయ్యారని గుర్తు చేశారు. మొట్టమొదటగా భూపంపిణీని అమలు చేసింది అప్పటి ముఖ్యమంత్రి, దివంగత వైఎస్‌ రాజశేఖరరెడ్డి అని, నేడు మళ్లీ పేదలకు భూములను పంచి పెడుతున్నది సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. దాన్ని ఓర్వలేక టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో పెన్షన్‌ కావాలంటే జన్మభూమి కమిటీల సభ్యులకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు ఇచ్చుకోవాల్సి వచ్చేదని, పక్కా గృహాల మంజూరుకు రూ.20 వేలు ముడుపులు ఇవ్వాల్సి వచ్చేదని గుర్తు చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



చికిత్స చేసుకుంటున్న ఆలయ ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆస్థాన మండపంలో శనివారం తిరుపతి ఆస్టర్‌ నారాయణాద్రి ఆస్పత్రి, వాసన్‌ ఐ కేర్‌ ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం ఉచిత వైద్య శిబిరానికి ఆలయ ఈఓ వెంకటేశు ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు ఆలయ ఉద్యోగులకు, సిబ్బందికి, స్థానికులకు కంటి, చెవి, షుగర్‌, బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఆలయ ఈఓ వెంకటేశు మాట్లాడుతు కార్పొరేట్‌ ఆస్పత్రి వారు స్వామివారి దేవస్థానం పరిసరాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.